



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి



జీప్‌లో సఫారీ రైడ్ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

'అనంతగిరి' అభివృద్ధే లక్ష్యం

» రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం అనంతగిరిలో పర్యటించిన ఆయనకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అనంతగిరి హరిత రిసార్ట్స్, వ్యూ టవర్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హరిత హోటల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా పరిగణిస్తూ బాధ్యతలను కలెక్టర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రైవేటు రిసార్ట్స్ అందించే సౌకర్యాలకు ఏ మాత్రం తగ్గకుండాఈ హోటల్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చే విధంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకొని హరిత హోటల్‌ను అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. పర్యాటకం దృష్టిలో వికారాబాద్‌కి ఉన్న ప్రత్యేకతను ఉపయోగించుకొని ఇక్కడి పర్వత అందాలు, రిసార్ట్స్ సౌకర్యాలు, వ్యూ టవర్‌కు ఆకర్షితులవుతారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, టూరిజం ఈడీ ఉపేందర్ రెడ్డి, డీఈ హన్మంత్‌రెడ్డి, కాంట్రాక్టర్ ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

29న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

బంట్వారం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో 29న దివ్యాంగుల కోసం ఉచిత ఉపకరణాల నిర్ధారణ గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్, ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానిఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎల్ఐఎంసీవో) ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగనుంది. ఈ శిబిరంలో వైద్యులు దివ్యాంగులను పరీక్షించి, వారికి అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందజేయనున్నారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, రేషన్ కార్డు, వైకల్యం 40శాతం పైగా ఉన్న యూడీఐడీ సర్టిఫికెట్, ఈఐఈ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. 0 నుంచి 18సంవత్సరాల మధ్య వయస్సు గల శారీరక వైకల్యం, సెరిబ్రల్ పాల్సీ, వినికిడి లోపం, బహుళ వైకల్యం, అంధత్వం, మానసిక వైకల్యం గలవారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు భవితా సెంటర్ లోక్య ఫోన్ నంబర్ 6300974151లో సంప్రదించాలన్నారు.



కళాశాలలు కళకళ

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరిగిన అడ్మిషన్లు

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. అడ్మిషన్ల సంఖ్య గత ఏడాది కంటే ఈ విద్యా సంవత్సరం పెరిగింది. ఇక్కడ విద్యార్థులకు ఇంటర్ చదువులతో పాటు జేఈఈ, నీట్, టీఎస్ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలకు సంసిద్ధం అయ్యేలా శిక్షణా తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. గతేడాది రెండు సంవత్సరాల్లో కలిపి 1,967 మంది ఉండగా ఈ సారి ఆ సంఖ్య 4,431కు పెరిగింది. అలాగే జిల్లాలో ఒక జూనియర్ కళాశాల సైతం పెరిగింది.

ఈ ఏడాది కొత్తగా 2,765మంది విద్యార్థులు చేరిక
తాండూరు కాలేజీలో అత్యధికంగా 923 మంది
ఉచితంగా అడ్మిషన్లు, పాఠ్య పుస్తకాల పంపిణీ
జేఈఈ, నీట్ తదితర పరీక్షలకు ప్రత్యేక తరగతులు
సదుపాయాల కల్పనకు రూ.2 కోట్లు విడుదల



వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ బొంరాస్‌పేట్: ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో గతేడాది 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య 13కు పెరిగింది. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 1,812 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 13 కళాశాలల్లో ఇప్పటి వరకు 2,765 మంది విద్యార్థులు చేరారు. వీరిలో జనరల్ 2,227 మంది, ఒకేషనల్‌లో 538 మంది ఉన్నారు. గతేడాది ద్వితీయ సంవత్సరంలో 1,575 మంది ఉండగా,

మిగతా 8వ పేజీలో...

కళాశాలలు, విద్యార్థుల వివరాలు

	గతేడాది	ఈ సంవత్సరం
జూనియర్ కాలేజీలు	12	13
ప్రథమ సంవత్సరం	1,812	2,765
ద్వితీయ సంవత్సరం	1,575	1,666
మొత్తం స్టూడెంట్స్	1,967	4,431

ఈ ఏడాది అడ్మిషన్లు

కళాశాల	జనరల్	ఒకేషనల్
తాండూరు	552	371
నవాబ్‌పేట్	67	-
వికారాబాద్	337	61
పెద్దేముల్	104	-
పరిగి	244	-
మర్పల్లి	78	21
మోమిన్‌పేట్	118	-
దోమ	148	-
కొడంగల్	285	-
దౌల్తాబాద్	112	-
బషీరాబాద్	55	16
బొంరాస్‌పేట్	79	50
హకీంపేట్	48	19
మొత్తం	2,227	538

కాలేజీ ఏర్పాటుతో ఆనందం



బొంరాస్‌పేట్‌లోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్లనే నేను ఇంటర్ చదవడానికి అవకాశం ఏర్పడింది. లేకపోతే తాండూరు, పరిగి వెళ్లాల్సి వచ్చేది. అక్కడకు వెళ్లి చదివేందుకు మా ఇంట్లో అంగీకరించే వారు కాదు. ఇక్కడ కళాశాల లేనప్పుడు ఇంటర్ చదివేందుకు ఆడ పిల్లలు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. స్థానికంగా కళాశాల ఏర్పాటు చేసి స్థానిక ఆడ పిల్లలకు ఇంటర్ చదివే అవకాశం కల్పించడం ఆనందంగా ఉంది.

- భూమిక, ఫస్టియర్ విద్యార్థిని, బొంరాస్‌పేట్

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, మున్సిపాలిటీ, పెన్షన్లు, రెవెన్యూ, మెడికల్, వ్యవసాయ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 95 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు అందజేసినట్లు వివరించారు. అలాగే హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన దరఖాస్తుల పురోగతిపై ఆమె సమీక్షించారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

మేడ్చల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజలంతా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వెనుకబడిన తరగతుల శాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని కుమ్మరులు మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేయడంలో శిక్షణ పొంది ఉన్నారన్నారు. వారు తయారు చేసిన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకొని పూజించాలని కోరారు. తద్వారా కుమ్మరి కులస్థులకు సైతం ఆర్థిక సహకారం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములుగా మారుతామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి
మురహరిపల్లిలో డబుల్ ఇళ్ల పరిశీలన
సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



'డబుల్' ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

శామీర్‌పేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రాంతంలో లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు వెంటనే కల్పించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మురహరిపల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల అపార్ట్‌మెంట్ సముదాయాలను ఆయన అదనపు కలెక్టర్ రాధికగుప్తాతో కలిసి పరిశీలించారు. అక్కడ లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు నీటి వసతి కల్పించేందుకు వెంటనే చర్యలను తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అడగ్గా.. ప్రహరీని నిర్మించాలని వారు కోరారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ ప్రహరీ నిర్మాణానికి అయ్యే నిధుల కోసం నివేదికలను వెంటనే తయారు చేసి సమర్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, అటవీ శాఖ, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ శాఖ, అధికారులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ ఈడీ ఖుష్రుషా ఖాన్

7

కమీషన్ డబ్బులు వెంటనే ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట డీలర్ల నిరసన

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

» సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

మేడ్చల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యలు, డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ, జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, అశోక్, రాజశేఖర్, శ్రీనివాస్, రాథోడ్ సంతోష్, నరేష్, లింగస్వామి, లక్ష్మణ్, శంకర్, వెంకన్న, గణేశ్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తక్షణమే రుణమాఫీ చేయాలి

» ఘట్‌కేసర్ మండల రైతుల ఆందోళన

ఘట్‌కేసర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని రుణమాఫీ సాధన సమితి సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ నుంచి సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ప్రజావాణిలో రైతులు ఆందోళన చేస్తారని భావించిన పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఆవరణలో బైఠాయించి ఆందోళన దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రుణమాఫీ పూర్తి చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని రైతు సేవా సహకార బ్యాంక్‌లో రుణం తీసుకున్న 1,189మంది రైతులకు ఇప్పటి వరకు మాఫీ కాలేదన్నారు. సీఎం కల్లిబొల్లి మాటలు చెప్పడం తగదన్నారు. రుణమాఫీ చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు. ప్రభుత్వం మేడ్చల్ నియోజకవర్గ రైతులను చిన్నచూపు చూస్తూ తీవ్రంగా అవమానిస్తున్నదని ఆరోపించారు. అంతట రుణమాఫీ చేసి ఇక్కడి రైతులకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నదని వాపోయారు. అలాగే రైతు భరోసాను సైతం సకాలంలో అందించకుండా దానికోసం సైతం ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఘట్‌కేసర్ రైతులు ఏం పాపం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రాధిక గుప్తాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, రుణమాఫీ సాధన సమితి కన్వీనరం కంట్ల గౌరీశంకర్, కొమ్మిడి శోభరాణి, రేసు లక్ష్మారెడ్డి, దామోదర్ రెడ్డి, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ముఖ చిత్రం ద్వారా పెన్షన్ పంపిణీ

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



పోస్ట్ మాస్టర్లకు ఫోన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పెన్షన్‌దారులకు ముఖ చిత్రం ద్వారా పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు ఆయన మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 194 మంది పోస్ట్ మాస్టర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. వారందరికీ మొబైల్ ఫోన్లు అందజేస్తున్నామన తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారా పెన్షన్‌దారుల ముఖ చిత్రాన్ని తీసి, దాని ఆధారంగా పెన్షన్ అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 130 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 130 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు

ఎరువుల దుకాణాల వద్ద బారులు
అదును దాటుతోందని ఆందోళన
'వికారాబాద్'లో అన్నదాతల నిరసనలు



ధారూరు: ధారూరు సొసైటీ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

వికారాబాద్/ మర్పల్లి/ ధారూరు/ మోమిన్‌పేట్/ చౌడాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వర్షాలు కురిసిన అనంతరం తెరపి ఇవ్వడంతో పంటలకు యూరియాను వేసేందుకు రైతులు ఫర్టిలైజర్ దుకాణాలకు క్యూ కడుతున్నారు. పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా అవసరం ఉన్న నేపథ్యంలో సరిపడా దొరక్క పోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. గతంలో బయట మార్కెట్‌లో లభించిన యూరియా ఇప్పుడు దొరకని పరిస్థితి నెలకొంది. యూరియా దొరికే చోట కూడా పాస్ పుస్తకాలు ఉంటే తప్ప దొరకని పరిస్థితి నెలకొంది. సోమవారం వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు యూరియా కోసం క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడ్డారు. మర్పల్లి గోదాం నుంచి యూరియా సరఫరా అయిన తర్వాత

మిగతా 8వ పేజీలో...

పరిహారం ఇచ్చి ఆదుకోండి


చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం వద్ద బాధితులు

చేవెళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేవెళ్లలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుతో ప్లాట్లు కోల్పోతున్న తమకు పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని బాధితులు సోమవారం ఆర్డీవో కార్యాలయ ప్రజావాణిలో వినతిపత్రమిచ్చారు. నిర్వాసితులు మాట్లాడుతూ.. 2016లో చేవెళ్ల వెంచర్‌లో ప్లాట్లు కొనగా బీజాపూర్ హైవేకు ప్లాట్లు సేకరిస్తూ పరిహారం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, బస్వరాజ్, సందీప్‌కుమార్, వేణు, సుదర్శన్‌రెడ్డి, శివకుమార్, రాజేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మణ్, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

శామీర్‌పేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పథకాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) కార్పొరేట్ విభాగ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం అలియాబాద్‌లోని ఎస్పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆర్బీఐ ఏజీఎం రెహ్మాన్, సీబీఐ అలియాబాద్ బీఎం మాధురి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కుటుంబంలోని సభ్యులంతా బ్యాంక్ ఖాతాలు తెరిచి వాటిల్లో డబ్బులు జమచేస్తుండాలన్నారు. ఏదైనా బ్యాంక్‌లో ప్రతి ఒక్కరు తమ ఖాతా రీ-కేవైసీని తప్పక చేయించుకోవాలని సూచించారు. బ్యాంక్ అకౌంట్‌లో మినిమం డిపాజిట్ రూ.256 ఉంచుకోవాలని, ఆ డబ్బుతో బీమా వర్తిస్తుందన్నారు. ఎల్‌డీఎం శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై విడమర్చారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి సైబర్ నేరాలపై వివరించారు. అనంతరం అధికారులు డ్వాక్రా గ్రూపులకు రూ.5.36కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సీబీఐ హైదరాబాద్ జోనల్ హెడ్ దారాసింగ్‌నాయక్, రీజినల్ హెడ్ దిలీప్‌కుమార్, బన్వర్‌లాల్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ ఉమాజానకి, సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్‌ను క్రీడా కేంద్రంగా మార్చేందుకు కృషి

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


క్రీడాకారులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గాన్ని క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పలువురు క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రూ.3లక్షల నగదును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో రాణించాలేక పోతున్నారని చెప్పారు. విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు తన వంతు ఆర్థిక సహకారం అందిస్తానని తెలిపారు. త్వరలో క్రీడా ప్రణాళిక రూపొందిస్తామని, షాద్‌నగర్ నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తయారీకి కృషిచేస్తానన్నారు. క్రికెట్ కిట్ల కోసం షాద్‌నగర్ క్రికెట్ అసోషియేషన్ నిర్వాహకులు కబీర్‌కు రూ.లక్ష, చెస్, వాలీబాల్ అసోషియేషన్లకు రూ.50వేలను అందజేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించే యోచనను మానుకోండి


ఇబ్రహీంపట్నంలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటు పేరిట ఇబ్రహీంపట్నంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంఖాల్‌కు తరలించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సోమవారం ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని మరోచోటికి తరలిస్తే ప్రజలకు ఇబ్బంది అవుతుందన్నారు. కార్యాలయాలు ప్రజలకు చేరువగా ఉండాలి గానీ దూరంచేస్తే ఊరుకోం అని హెచ్చరించారు. పాత బస్టాండ్ వద్ద అర్థాంతరంగా నిలిపివేసిన భవనాన్ని పూర్తి చేసి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అందులోకి మార్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీజేపీ మండల అధ్యక్షుడు ముత్యాల మహేందర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, టేకుల రాంరెడ్డి, రాఘవేందర్, విజయ్‌కుమార్, సందీప్, అనిల్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ తరలింపు ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన అంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ తీసుకుని కార్యాలయ తరలింపును అడ్డుకోవాలని కోరారు. నిరసనలో నాయకులు బుగ్గరాములు, జగన్, ఎల్లేష్, కృష్ణ, స్వప్న, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు. ప్రజావాణిలోనూ పలువురు విజ్ఞాపన పత్రాలు అందజేశారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


వైద్యాధికారికి వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్, ఆశా కార్యకర్తలు

కందుకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆశాలతో కలిసి వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని అమలు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు శ్రీలత, జయసుధ, అండాలు, ముంతాజ్ బేగం, అనిత, రజిత, మంజుల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆమనగల్లు విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ బెల్టులు సాధించారు. హైదరాబాద్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆమనగల్లుకు చెందిన జగదీశ్వర్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. ఏడుగురు గోల్డ్, ఇద్దరు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఆరిని మాస్టర్ జగదీశ్వర్, నాయకులు సత్కరించారు.


మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ జగదీశ్వర్

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న విజయ్‌కుమార్, వరప్రసాద్‌రెడ్డి

కీసర, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నూతన సాకేంతికతతో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జేఎన్టీయూ రెక్టార్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నాగారం పరిధి భోగారం హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు దేశానికి దోహదపడేలా ఉపాధి పొందాలన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కళాశాల అటనమస్‌గా ఏర్పడిన అనంతరం మొదటి బ్యాచ్‌లో అధిక సంఖ్యలో ఉతీర్ణత సాధించారని కళాశాల ఫౌండర్ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ సెక్రటరీ విజయశారదరెడ్డి, చైర్మన్ సిద్ధార్థరెడ్డి, విభాగాల హెచ్‌ఓడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి

గుండెపోటుతో యువకుడి మృతి

మంచాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన నూకం జంగయ్య(35) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యుడైన నూకం జంగయ్య ఇటీవల పాఠశాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, జానీపాషా, కంబాలపల్లి భాస్కర్, నూకం రాజు, గుడ్డిమల్ల చంద్రయ్య తదితరులు నూకం జంగయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేయాలని ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) ఖుష్రుషా ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన వికారాబాద్ ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజ్, స్టోర్స్ టైర్, ఆయిల్, వాషింగ్, ట్రాఫిక్, చార్ట్ డ్యూటీ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి పనితీరుపై ఆరా తీశారు. ఏయే మార్గాల్లో ఎంతెంత ఆదాయం వస్తోందే వివరాలను డిపో మేనేజర్ నర్మదను అడిగి తెలుసుకున్నారు. తీర్థయాత్రలు, శుభ కార్యాలు, విహార యాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్న విషయం ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. వికారాబాద్ డిపో పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఆదాయం, సేవలు పెంపొందించుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎం పీఎస్ శ్రీనివాస్, డిపో మేనేజర్ నర్మద, ఎంఎఫ్ సురేందర్, చార్ట్ డ్యూటీ కంట్రోలర్లు, భద్రతా విభాగం అధికారి అనంతగిరిపల్లి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగు లాభదాయకం

తలకొండపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంటల సాగు రైతులకు లాభదాయకమని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి అన్నారు. తలకొండపల్లి మండలం రాంపూర్ రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ, రాంపూర్‌రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నూనె గింజల మిషన్ సహకారంతో వేరుశనగ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో రేణుకచక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏడీఏ హాజరై మాట్లాడారు. జాతీయ నూనె గింజల మిషన్ వేరుశనగ పథకం కింద మండల పరిధిలో 535 మంది రైతులను ఎంపిక చేసి వెయ్యి ఎకరాల్లో వేరుశనగ సాగు చేయనున్నట్లు తెలిపారు. రైతులు వేరుశనగ సాగుకు సెప్టెంబర్ 20 వరకు పొలాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

కడ్తాల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మక్తమాదారం నుంచి నేదునూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా నాయకుడు నింగ్యారి యాదగిరి, గ్రామ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. సోమవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

చేవెళ్ల/మొయినాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ ఆరోపించారు. సోమవారం చేవెళ్లలో ఏబీవీపీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి హారిక, నాయకులు ఆకాశ్, హరికృష్ణ, మణిదీప్ ఉన్నారు. మొయినాబాద్‌లో నగర కార్యదర్శి బట్టు విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు.



రూ.9కోట్లతో ఉపాధి పనులు

కోట్‌పల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో 2024, 2025, ఆర్థిక సంవత్సరానికి రూ.9కోట్లతో ఉపాధి హామీ పనులు చేశామని డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. పనులపై పది రోజులు 18 పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. సోమవారం కోట్‌పల్లి మండల పరిషత్ ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికలో డీఆర్డీవో మాట్లాడారు. ఉపాధి కింద చేసిన ఖర్చులో ప్రతీ రూపాయికి లెక్క ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి ఉపాధి పొందే వారుంటే అలాంటి వారి జాబ్ కార్డును రద్దు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీవో డేనియల్, అంబుడ్స్‌మన్ రాములు, ఏపీవో ఎలీష, ఎస్ఆర్‌పీ ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలి

వికారాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతగిరి హాక్స్ టీ-షర్ట్ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అనంతగిరి హాక్స్ జట్టు తెలంగాణ యువ సిరీస్ చాంపియన్‌షిప్ జట్టుగా జిల్లాకు ప్రాతినిత్యం వహించడం గర్వకారణమన్నారు. వారం రోజులుగా జిల్లా అధ్యక్షుడు పరశురాంనాయక్, జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్, ఎన్‌కేఎన్ టీం ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహించారన్నారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు ఎల్బీ స్టేడియంలో జరిగే తెలంగాణ యువ సిరీస్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిత్యం వహిస్తుందన్నారు.

ముగిసిన స్వాతి అంత్యక్రియలు



అంబులెన్స్‌లో స్వాతి మృతదేహం

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో దారుణహత్యకు గురైన స్వాతి మృతదేహానికి కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రు నయనాల మధ్య సోమవారం రాత్రి అంత్యక్రియలు జరిగాయి. హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో స్వాతి మృతదేహం రాత్రి 10.30గంటలకు చేరుకుంది. స్వాతి తల్లి, తండ్రి, సోదరి రోదనలు మిన్నంటాయి. గ్రామ శ్మశానవాటికలో స్వాతి మృతదేహానికి తండ్రి రాములు చితి పెట్టాడు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులను మోహరించారు. పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించారు.

మనిషి కాదు... రాక్షసుడు

ప్రేమించి పెళ్లాడిన స్వాతి గర్భిణి అని కూడా చూడకుండా భర్త మహేందర్‌రెడ్డి హత్య చేయడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. హంతకుడు రాక్షసుడిగా వ్యవహరించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళ్లు, చేతులు, మొండెం నరకడం హేయం అన్నారు. భార్యను కిరాతంగా హతమార్చి గ్రామానికి మాయని మచ్చ తెచ్చాడని మండిపడ్డారు.

కమీషన్ డబ్బులు వెంటనే ఇవ్వాలి

- జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్
- డీఎస్‌వోకు వినతిపత్రం అందజేత


డీఎస్‌వోకు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు రావాల్సిన ఐదు నెలల కమీషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఎస్‌వోకు వినతిపత్రం ఇచ్చారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమీషన్ రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో డీలర్లకు రూ.5వేల గౌరవవేతనం ఇస్తామని, కమీషన్ సైతం పెంచుతామని ప్రకటించారని, మాట నిలబెట్టుకోవాలన్నారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపులను వచ్చే నెలా 5న బంద్ పాటిస్తామని తెలిపారు. రేషన్ షాపుల్లో మరిన్ని నిత్యావసర సరుకులను పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీలర్ల సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ వై.భానుచందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సి.సత్తయ్య, సత్యనారాయణ, కోషాధికారి శివకుమార్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట డీలర్ల నిరసన

వికారాబాద్: రేషన్ డీలర్లకు బకాయిపడ్డ కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని డీలర్ల సంఘం అధ్యక్షుడు జూకారెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా పంపిణీ చేశామన్నారు. కానీ తమకు కమీషన్ నెలల తరబడి చెల్లించకపోవడం దారుణమన్నారు. దుకాణాల అద్దె, విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చులతో అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా కాకుండా పాతపద్ధతి ప్రకారమే కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీలర్ల వద్ద ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం రికవరీ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల డీలర్లు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో జిల్లా బీసీ నేతలు

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్రం నుంచి అఖిలపక్ష నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లాలని ప్రముఖ న్యాయవాది, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో జిల్లాకు చెందిన బీఆర్ కృష్ణతో పాటు తాండూరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ రాకముందే అభివృద్ధి చేసుకుందాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కొత్తూర్-జేపీ దర్గా రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్, అధికారులు

కొత్తూర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రాక ముందే కొత్తూర్ మునిసిపాలిటీలో అభివృద్ధి పనులను చేసుకుందామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బీటీ, సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం సమీక్ష నిర్వహించారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌కు ముందే మిగిలిన పనులను ప్రారంభించాలని, అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని తెలిపారు. కొత్తూర్ మండల కేంద్రానికి సింగిల్ విండోను మంజూరు చేశామన్నారు. నందిగామ మండలంలో ఉన్న కొత్తూర్ పీహెచ్‌సీని కొత్తూర్‌కు మార్చేలా ఉత్తర్వులొచ్చాయని, ఆస్పత్రి నిర్మాణానికి స్థలసేకరణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బైపాస్ రోడ్డులో జేపీదర్గా చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. కొన్ని దుష్టశక్తులు ఫ్లైఓవర్ రాకుండా ప్రయత్నిస్తున్నారని, ఎవరెన్ని జిత్తులు వేసినా ఫ్లైఓవర్ నిర్మించి తీరుతామని తేల్చి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, హెచ్ఆర్‌డీసీ ఈఈ క్రాంతి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు హేమదేవేందర్, సోమ్లు నాయక్, నాయకులు బి.దేవేందర్‌యాదవ్, జనార్థన్‌చారి, నర్సింహ,చంద్రపాల్‌రెడ్డి, ఎమ్మె సత్తయ్య, రాజు, జె.శ్రీను, జగన్, ఇందూరి శ్రీను, కర్రోల్ల సురేందర్, నవీన్‌చారి, ఏనుగు జనార్థన్‌రెడ్డి, చిలకమర్రి నర్సింహ, గోవింద్‌నాయక్, జగదీశ్వర్‌గౌడ్, భార్గవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలి

- మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజారెడ్డి


లక్ష్మీనారాయణ చెరువు వద్ద సూచనలిస్తున్న డీసీపీ పద్మజారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ పద్మజారెడ్డి ఆదేశించారు. సోమవారం ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువును ఆమె సందర్శించి వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. బారికేడ్లు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి, సీఐలు ఎం.బాలస్వామి, రాజువర్మ, ఎస్సైదులు, డీఐ శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ సతీష్, ఆర్ఐ కావ్య, కె.కుమార్, వేములు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పించేందుకు కృషిచేయాలని డీసీపీ పద్మజారెడ్డి అన్నారు. ప్రతాప్ ఎసింగారం జెడ్పీ పాఠశాలలో నిర్మించిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, హెచ్ఎం రవికుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: మంగళపల్లిలో కాజ్‌వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

గ్రామాల అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, ఆగసు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామాల్లో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. మంగళపల్లిలో కాజ్‌వేను, గోవిందాయిపల్లిలో పంచాయతీ భవనాన్ని ఆయన ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ జి.భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, డీఈఈ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. చుక్కాపూర్, మంగళపల్లి, చెన్నకేశవ కాలనీ, గోవిందాయిపల్లి తండా అంగన్‌వాడీ, మక్తమాదారంలో పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవనాలు లేని, శిథిలావస్థకు చేరిన అన్ని పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని తెలిపారు. రోడ్లు లేని అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సుజాత, శ్రీకాంత్, రెహెమాన్, తహసీల్దార్ ముంతాజ్, సీడీపీవో శాంతిరేఖ, ఏఈలు అభిషేక్, పరమేశ్, సీఐ జానకిరాంరెడ్డి, గంగాధర్, ఏడీఏ శోభారాణి, ఎంపీవోలు లాలయ్య, వినోద, నాయకులు నర్సింహ, రమణారెడ్డి, టి.నారాయణరెడ్డి, రవీందర్, రాము, సులోచనసాయిలు, మంజులచంద్రమౌళి, జి.కేశవులు, వెంకటేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్: మక్తమాదారంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కేబుళ్లు కట్!

- ఆర్టీఏ కార్యాలయంలో నిలిచిన సేవలు

నార్సింగ్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో సోమవారం సేవలు నిలిచిపోయాయి. ఓ పక్క వినాయకచవితి సందర్భంగా అడ్డంగా ఉన్న కేబుళ్లను కట్‌చేసి విగ్రహాలు తరలించగా, మరో పక్క ట్రాన్స్‌కో అధికారులు మణికొండ మర్రిచెట్లు నుంచి హరివిల్లు వరకు ఉన్న కేబుళ్లను కట్ చేశారు. ఇదే రోడ్డుపై ఉన్న ఆర్టీఏ కార్యాలయానికి ఇంటర్నెట్ సేవలు నిలిచాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి సేవలు కొనసాగలేదు. లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారంతా వెనుదిరిగిపోయారు. 150 మంది వరకు పనులు కోసం కార్యాలయానికి వచ్చారు. వారందరిని మంగళవారం రావాలని అధికారులు సూచించారు.

పొదుపు సంఘం పేరిట రూ.20లక్షలు స్వాహా

- డీఆర్‌డీఏ డీపీఎంలకు మహిళల ఫిర్యాదు


డీపీఎం యాదయ్యకు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

యాచారం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డిఫాల్ట్ అయిన డ్వాక్రా పొదుపు సంఘం నుంచి రూ.20లక్షలు స్వాహా చేసిన ఉదంతం సోమవారం వెలుగులోకొచ్చింది. ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. చౌదర్‌పల్లికి చెందిన రోహిణి అనే పేరిట నిర్వహించిన మహిళా సంఘం లావాదేవీలు 2020 నుంచి నిలిచిపోయాయి. గ్రామ పొదుపు సంఘాల నిధులను ఫోర్జరీ సంతకాలతో కాజేసినట్లు ఇటీవల వార్తలు రావడంతో సంఘాల మహిళలు తమ గ్రూప్‌ల వివరాలు ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో రోహిణి, వెంకటేశ్వర సంఘాల మహిళలు ఎస్‌బీఐలో తమ ఖాతాల వివరాలు తీసుకున్నారు. రోహిణి సంఘం నుంచి 16-10-2024న ఫోర్జరీ సంతకాలతో రూ.20లక్షలు తీసుకున్నట్లు తేలడంతో మహిళలు సోమవారం డీపీఎంలు యాదయ్య, లలితలకు ఫిర్యాదు చేశారు. ఈ మోసం తెలిసి అధికారులు సైతం విస్తుపోయారు. అలాగే వెంకటేశ్వర సంఘం నుంచి కూడా నిధులు డ్రాచేశారని మహిళలు ఫిర్యాదు చేశారు. తమ సంఘాల రికార్డులు ఇవ్వాలని సిబ్బంది, నిర్వాహకులను అడిగినా ఇవ్వడం లేదని సంఘాల మహిళలు చెప్పారు. డబ్బు కాజేసిన వారి నుంచి రికవరీ చేసి చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు. తాము గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

రోడ్డు విస్తరణతో నష్టపోతాం


కలెక్టరేట్ ఎదుట పోలెపల్లి గ్రామస్తులు

దుద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 100 ఫీట్ల రోడ్డు విస్తరణతో తాము తీవ్రంగా నష్టపోతామని పోలెపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 100 ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో పేద ప్రజలు ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఉందని వాపోయారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించుకున్న ఇళ్లు రోడ్డు విస్తరణలో కోల్పోతే తాము రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం వెలుపలి నుంచి బైపాస్‌రోడ్డు వేసేందుకు అవకాశం ఉందని, ఈ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకోవాలని కోరారు.


ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

మర్పల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం అవుతుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు రాములుయాదవ్ అన్నారు. బిల్కల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సోమవారం ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సురేశ్, బ్లాక్-2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు రవీందర్, ప్రభాకర్, రఫీయోద్దీన్, రాజన్న, సురేశ్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మహేశ్వరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలను అమలుచేయాలనే డిమాండ్‌తో సోమవారం మహేశ్వరంలో బీజేపీ మండలాధ్యక్షుడు తెల్లమల్ల యాదీశ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి గెలిచేందుకు బీసీ రిజర్వేషన్ బిల్లు పేరిట తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలు గమనించాలన్నారు. రెండేళ్లుగా గ్రామాల్లో ఒక్కపనీ కాలేదన్నారు. ప్రజాప్రతినిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి అనేదే లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పి బీజేపీని గెలిపించాలన్నారు. సమస్యల పరిష్కారంపై ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్యగౌడ్, ప్రేమ్‌రాజ్‌యాదవ్, అనంతయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, మాధవచారి, సుదర్శన్‌యాదవ్, శ్రవణ్, శ్రీనివాస్, మోహన్‌నాయక్, శంకర్, పరమేశ్, పంతునాయక్, కృష్ణానాయక్, హన్మంతు, నాగరాజు, జంగయ్య పాల్గొన్నారు.


గ్యారెంటీలను అమలు చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

విద్యారంగంపై ప్రభుత్వానికి పట్టింపేది?

వికారాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మాత్రం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్‌రావు విమర్శించారు. పట్టణంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయక పోవడంతో ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు విద్యార్థులపై భారం మోపుతున్నాయని ఆయన ఆరోపించారు. సర్టిఫికేట్లు ఇవ్వక కళాశాలలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సమస్యలు పరిష్కరించక పోతే ఏబీవీపీ ఉద్యమాలకు దిగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ నరేష్ కుమార్, మహేష్, సాయి కార్తీక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మోమిన్‌పేట్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మోమిన్‌పేట్ సొసైటీ చైర్మన్ బంద విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. టేకులపల్లి జెడ్పీ పాఠశాలలో సోమవారం 69వ కబడ్డీ పోటీలు ప్రారంభించారు. పోటీల్లో మూడు మండాలకు చెందిన 55 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నిత్యానంద్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘట్‌కేసర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ నూతన కమిషనర్ నిత్యనంద్‌ను సోమవారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, నల్లవెల్లి శేఖర్, శ్రీనివాస్, అక్రం అలీ, కాశయ్య, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

పరిగి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పరిగిలో అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పరిగిలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అనిల్, సత్తయ్య, రఘురాం పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



నవాబుపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కడ్చాల్‌లోని మైసిగండి గ్రామంలో సోమవారం మైసమ్మ ఆలయాన్ని చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు. ఆలయంలో నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయొద్దు

దౌల్తాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోల్కంపల్లి గ్రామ శివారులోని సర్వే నెం.21లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం నిలిపి వేయాలని గ్రామస్థులు కోరారు. జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి పత్రం అందించారు. సర్వే నెం.21లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన జరుగుతున్నట్లు తెలిసిందన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే తమ కుటుంబాలు జీవనాధారం కోల్పోతాయని తెలిపారు.

గనిలో వ్యర్థాలు వేశారని ఫిర్యాదు

తాండూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఓగీపూర్ పట్టాభూమి సర్వేనెంబర్-65లోని తన గని భూమిలో ఇతర వ్యక్తులు వ్యర్థాలు వేశారంటూ యజమాని కన్నాలు వెంకట్‌రాంరెడ్డి మైన్స్ అధికారులు, కలెక్టర్‌తోపాటు లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. అనుమతులు లేకుండా అక్రమంగా 30గుంటల భూమిలో నాపరాతి తవ్వకాలు జరుగుతున్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు సోమవారం మైన్స్ ఏడీ సత్యనారాయణ ఆదేశాల మేరకు సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ నిర్మల, తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్‌లు ఓగీపూర్‌లోని వెంకట్‌రాంరెడ్డి గనిని పరిశీలించారు. జాయింట్ సర్వే చేపట్టి వివరాలు సేకరించారు. సర్వే నెంబర్-64 పట్టా భూమి యజమాని గఫూర్ పాషాకు చెందిన గనిలో నుంచి వ్యర్థాలను వెంకట్‌రెడ్డికి చెందిన భూమిలో వేశారని గుర్తించారు. వ్యర్థాలను తొలగించేందుకు ఒప్పుకున్నారని రెవెన్యూ సర్వేయర్ మహేష్ తెలిపారు. వారివెంట బసంత్‌రావు పటేల్, జుబేర్ లాలా, నాపరాతి వ్యాపారులున్నారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించాలి

పెద్దేముల్/కొడంగల్/దుద్యాల/బొంరాస్‌పేట్/బంట్వారం/కులకచర్ల/యాలాల/కోట్‌పల్లి/నవాబుపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పండుగలు ప్రశాంతంగా జరపాలని తాండూరు రూరల్ సీఐ నగేష్ అన్నారు. వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీ పండగలను పురస్కరించుకుని పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పలు రాజకీయపార్టీల నాయకులు, మతపెద్దలు, యువకులతో పోలీసులు శాంతిసమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక మండప నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో వారి పేరున నమోదు చేసుకోవాలని సూచించారు. రాత్రి 10గంటల తర్వాత మైకులు బంద్‌చేయాలని సూచించారు. డీజేలు పెడితే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్, ఎంపీడీవో రతన్‌సింగ్, ఎస్ఐ వేణుకుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్ రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా శాంతి సమావేశం నిర్వహించారు. ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు. దుద్యాల మండల కేంద్రంలో ఎస్ఐ యాదగిరి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సమావేశంలో తహసీల్దార్ కిషన్‌నాయక్, ఎంపీడీవో మహేశ్‌కుమార్ పాల్గొన్నారు. బొంరాస్‌పేట్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి శాంతి సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఎస్ఐ బాల వెంకటరమణ, ఆర్ఐ శిరీష, నాయకులు పాల్గొన్నారు. బంట్వారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ధారూర్ సీఐ రఘురాములు ఉత్సవ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐ విమల, గణేష్ ఉత్సవల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కులకచర్లలోని విజయ చంద్రఫంక్షన్ హాల్‌లో ఎస్ఐ రమేశ్‌కుమార్ వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంఈవో హబీబ్ అహ్మద్ పాల్గొన్నారు. యాలాలలో సీఐ నగేష్ పోలీసు స్టేషన్ ఆవరణలో వినాయక మండప నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎస్ఐ విఠల్, సిబ్బంది పాల్గొన్నారు. కోట్‌పల్లిలో ఎస్ఐ శైలజ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా ధారూరు సీఐ రఘురాములు ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. నవాబుపేటలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో మోమిన్‌పేట్ సీఐ వెంకట్ పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఐ పండ్లిక్, ఏఎస్ఐ మురళీ పాల్గొన్నారు.



బంట్వారం: మాట్లాడుతున్న ధారూర్ సీఐ రఘురాములు

మట్టి గణేశ్ విగ్రహాల పంపిణీ

కీసర రూరల్: పర్యావరణ పరిరక్షణకు దమ్మాయిగూడలోని క్రాంతి కిడ్స్ అకాడమి ఆధ్వర్యంలో మట్టి గణేశ్ విగ్రహాలను పంపిణీ చేశారు. మొక్కలు నాటిన వారికి స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లు, రేంజర్ సైకిళ్లను బహుమతిగా అందజేస్తున్నారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పల్ కళ్యాణి, కవిత, అల్తాఫ్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి పూర్వవైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు

వికారాబాద్: పట్టణంలో వినాయక నిమజ్జనానికి పూర్వవైభవం తీసుకురావాలని హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోకట్ మాదవరెడ్డి అన్నారు. పట్టణంలోని రామ మందిరంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన సందర్భంగా మధ్యాహ్నం 2గంటలలోపే న్యాగంజ్‌కు చేరుకొని శోభయాత్రలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 31న వికారాబాద్ శ్రీరామ మందిరంలో హిందూ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణపంతులు, ప్రశాంత్, రమేష్ కుమార్, కేపీ రాజు, మల్లికార్జున్‌గౌడ్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మండపాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

వినాయక మండపాల వద్ద సౌకర్యాలు కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు సోమవారం మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండపాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి అవసరమైన చోటడస్ట్ వేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్‌రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, గిరీష్ కోఠారి, కిషోర్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండపాలకు తరలుతున్న గణనాథులు



తాండూరుకు తరలిస్తున్న గణేశ్ విగ్రహం

కొడంగల్ రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని పల్లెలు, పట్టణాల్లో సందడి వాతావరణం నెలకొంది. నిర్వాహకులు గణేశ్ మండపాలను సిద్ధం చేసుకున్నారు. గణనాథుల విగ్రహాలను మండపాలకు తరలిస్తున్నారు. భారీ విగ్రహాల తరలింపులో ఇబ్బందులు తప్పలేదు.

క్రైం కార్నర్

బీరోల్ గ్రామంలో విషాదఛాయలు



రవీందర్, కృప(ఫైల్)

కోట్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతురు అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కోట్‌పల్లి మండలం బీరోల్ గ్రామానికి చెందిన తాండ్ర రవీందర్ (32) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మొయినాబాద్ మండలం తోల్కట్ట గురుకుల పాఠశాలలో చదువుతున్న కూతురు కృప(13)ను స్వగ్రామానికి బైక్‌పై తీసుకువస్తుండగా చేవెళ్ల బస్టాండ్ సమీపంలో వెనక నుంచి వచ్చిన సిమెంటు క్రషర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రవీందర్, కృప అక్కడికక్కడే మృతిచెందారు చిన్న వయసులో తండ్రి, కూతురు కానరాని లోకానికి వెళ్లడం బాధాకరమని బంధుమిత్రులు కుటుంబసభ్యులు కన్నీటిపర్వంతమయ్యారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి శవపంచనామా నిర్వహించారు. పరిసర ప్రాంతంలో బైక్ ఉండటంతో బైక్ నంబరును బట్టి విచారణ చేపట్టారు. మృతుడి సోదరి అయిన విజయలక్ష్మి శామీర్‌పేట్ చెరువు వద్దకు చేరుకుని షాపూర్‌నగర్‌కు చెందిన రామకృష్ణారెడ్డి(43)గా గుర్తించింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ భార్యాపిల్లలతో వేరుగా ఉంటూ జీవనం సాగిస్తున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. రామకృష్ణారెడ్డి అనారోగ్యం కారణంగా చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆవుదూడలను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆవుదూడలను తరలిస్తున్న ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన డీసీఎంను ఆపి సోదాచేయగా అందులో 13 ఆవు దూడలను గుర్తించారు. నీరు, ఆహారం లేకుండా, గాలి, వెలుతురు తగలకుండా దూడలు తరలిస్తున్న ఏపీలోని అనకాపల్లి, పాయకరావుపేట, నామవరంకు చెందిన డ్రైవర్ దండ మహేష్(35), క్లీనర్ సాయిరాం శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని తుని నుంచి హైదరాబాద్‌లోని తుక్కుగూడకు దూడలను తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వాహనం స్వాధీనం చేసుకొని దూడలను నగరంలోని జియాగూడ గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

తాండూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృత్యువాతపడిన ఘటన మండలంలోని చెంగోల్‌లో జరిగింది. గ్రామానికి చెందిన వడ్ల మోనప్ప వ్యవసాయం, పాల వ్యాపారం చేస్తున్నాడు. మోనప్పకు చెందిన ఒక గేదెను సోమవారం అల్లాపూర్ శివారులోని ఓ పొలంలో మేతకు తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృత్యువాతపడింది. గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

కుక్కదాడిలో బాలుడికి గాయాలు

కులకచర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో సోమవారం ఉదయం బ్యాగరి అంజి కుమారుడు అనికేత్ (8 సంవత్సరాలు) షాపు ఎదుట నిలబడి ఉండగా కుక్క కరిచింది. దీంతో బాలుడి నడుముకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

రేషన్‌డీలర్ల కమీషన్ విడుదల చేయాలి



పెద్దేముల్: వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

పెద్దేముల్/కొడంగల్/కులకచర్ల/యాలాల/కోట్‌పల్లి/తాండూరురూరల్/మోమిన్‌పేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రేషన్‌డీలర్లకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కమీషన్ వెంటనే విడుదల చేయాలని డీలర్ల సంక్షేమసంఘం మండల అధ్యక్షుడు అంజయ్య కోరారు. పెద్దేముల్ తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కమీషన్ విడుదల చేయకపోవడంతో కుటుంబ పోషణకోసం అప్పులు చేయాల్సి వచ్చిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా కాకుండా పాతపద్ధతిలో రేషన్‌డీలర్ల కమీషన్ ఒకేసారి విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి రాచయ్య, డీలర్లు చంద్రశేఖర్, నర్సిములు, భీంమ్లానాయక్, రాందాస్ పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్‌లో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు మండలంలోని రేషన్ డీలర్లు వినతిపత్రం అందజేశారు. కులకచర్లలో రాష్ట్ర రేషన్ డీలర్‌ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు రాములు, అర్జున్‌గౌడ్, రతన్‌సింగ్, శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు. అదేవిధంగా యాలాల మండలంలో సోమవారం రేషన్‌డీలర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు చంద్రప్ప, ఆంజనేయ, సంగారెడ్డి తదితరులు ఉన్నారు. కోట్‌పల్లిలో డీలర్ల సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ యూనూస్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే కమిషన్ అందజేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. తాండూరు మండలంలోని రేషన్‌డీలర్లు శాంత్‌కుమార్, అంతారం ప్రకాశ్, మల్లేశ్ తదితరులు తాండూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మోమిన్‌పేట్‌లో రేషన్ డీలర్లు గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, సురేశ్, కిష్టయ్య తదితరులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి

తాండూరు రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గోనూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గోనూరు గ్రామంలో లబ్ధిదారులు పార్వతమ్మ, విఠలమ్మ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మల్లారెడ్డి, శివప్పలను పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ ఛైర్మన్ రవిగౌడ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఉదయ భాస్కర్‌రెడ్డి, నర్సిరెడ్డి, చాకలి వెంకటయ్య తదితరులున్నారు. కాగా, అల్లాపూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో రవిగౌడ్, బాల్‌రెడ్డి, విశ్వనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే

తాండూరు: మండల పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మానవత్వం చాటారు. తాండూరు బ్రిడ్జిపై ఓవ్యక్తికి ప్రమాదం జరగడంతో అదే బ్రిడ్జిపై వెళ్తున్న ఎమ్మెల్యే తన కారులో నుంచి దిగి పరామర్శించారు. దగ్గరుండి ఆ వ్యక్తిని ఆటోలో ఎక్కించి ఆస్పత్రికి పంపించారు.

నేషనల్ హైవే పనుల పరిశీలన

యాలాల: లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో జరుగుతున్న మహబూబ్‌నగర్-చించొళి నేషనల్ హైవే పనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. అక్కడే ఉన్న కొందరు రైతులు ఎమ్మెల్యేను యూరియా కోసం అడగడంతో వెంటనే జిల్లా వ్యవసాయాధికారితో ఫోన్‌లో మాట్లాడి యూరియా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, రవిగౌడ్ ఉన్నారు.



తాండూరులో సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆడియో సాంగ్ సీడీ ఆవిష్కరణ

తాండూరు/బషీరాబాద్: మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.మాధవరెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేరిట ఆడియోసాంగ్ సీడీని సోమవారం తాండూరులో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఏఎంసీ ఛైర్మన్ సోదరుడు జి. కేశవరెడ్డి జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు పలువురు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

రజకులకు ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

పరిగి,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రజకులకు ప్రత్యేకంగా ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. పరిగిలోని టీటీడీ కళ్యాణ మండలంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫెడరేషన్‌కు బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయించి ఛైర్మన్‌ను నియమించాలని కోరారు.

నైపుణ్యతకు పోటీ పరీక్షలు అవసరం

పరిగి,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీయడంలో పోటీ పరీక్షలు చాలా ఉపయోగపడతాయని ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి అన్నారు. ఇండస్‌వాలీ స్కూల్‌లో ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ సంస్థ నిర్వహించిన పరీక్షలు ప్రతిభను విద్యార్థులకు సోమవారం పతకాలు, మెడల్స్‌ను అందజేశారు.

టీబీపై ప్రజలకు అవగాహన

కోట్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని డాక్టర్ మేఘన అన్నారు. ముక్సారత్ అభియాన్ జిల్లా టీబీ, అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ ఆదేశాల మేరకు సోమవారం కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటు అన్నసాగర్, ఇందోల్, ఒగులాపూర్, గ్రామస్తులకు టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా కృష్ణస్వామి ఊరేగింపు

చౌడాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మరికల్ గ్రామంలో సోమవారం కృష్ణస్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 10 రోజుల పాటు మరికల్ గ్రామంలో శ్రీకృష్ణ స్వామికి పూజలు నిర్వహించి ముగింపు సందర్భంగా సోమవారం ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ అధ్యక్షుడు నాగ్యానాయక్, మరికల్ ఉత్సవ కమిటీ నిర్వాహకుడు మల్లప్ప, బుచ్చలింగం పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దోమ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని ఎంపీడీవో గ్యామానాయక్ అన్నారు. ఉదన్‌రావుపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కళాశాలలు కళకళ

(ఐదో పేజీ తరువాయి)

ఈ ఏడాది 1,666 మంది విద్యార్థులు కొనసాగుతుండగా, వీరిలో జనరల్ 1,161 మంది , ఒకేషనల్ 505 మంది చొప్పున ఉన్నారు. కాగా, ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందడానికి ఈనెల 31వ తేదీ వరకు ఇంటర్ విద్యాశాఖ గడువు పొడిగించింది. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగాయి. జిల్లాలోని 13 కళాశాలల్లో 2,765 మంది విద్యార్థులు చేరగా అందులో జనరల్ కోర్సుల్లో 2,227, ఒకేషనల్ కోర్సుల్లో 538 మంది విద్యార్థులు చేరారు.

కార్పొరేట్‌కు దీటుగా...

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటర్ చదువులతో పాటు జేఈఈ, నీట్, తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే దిశగా ఇంటర్ విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ సహకారంతో విద్యార్థులకు పోటీ పరీక్షల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వనున్నారు. కొన్ని కళాశాలల్లో ఇప్పటికే శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. త్వరలో ప్రతీ కళాశాలకు కనీసం మూడు స్మార్ట్ బోర్డులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు అడ్మిషన్లతో పాటు పాఠ్య పుస్తకాలు ఉచితంగానే పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రతీ శనివారం హెల్ప్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మెడిటేషన్‌పై శిక్షణ ఇప్పించేందుకు ప్రతీ కళాశాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు ఇటీవల మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన స్టూడెంట్స్ కౌన్సిలర్లు తమ కళాశాలల్లో విద్యార్థులు మెడిటేషన్ చేసే విధంగా 16 వారాల పాటు శిక్షణ ఇస్తారు.


ప్రతీ శనివారం ప్రత్యేకం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మెడిటేషన్ పైన విద్యార్థులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా క్విజ్, డిబేట్, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే కళాశాల ఆవరణలో పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టనున్నారు. రోజూవారీ కార్యక్రమాలకు భిన్నంగా శనివారం కొనసాగనుంది.

విద్యార్థుల చదువులపై ఆరా

జూనియర్ కళాశాలల్లోనూ పేరెంట్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)లు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. ఈ సమావేశాలతో విద్యార్థుల హాజరు శాతం మెరుగవడమే కాకుండా ఉత్తీర్ణత శాతం పెరుగుతోందని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. పీటీఎం ఏ రోజు నిర్వహించనున్నారనేది కళాశాలల అధ్యాపకుల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు మొబైల్ ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తారు. ఈ సమావేశాల్లో విద్యార్థి చదువులు ఏ విధంగా కొనసాగుతున్నాయి? ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారు? హాజరు శాతం ఎలా ఉంది? కళాశాలలో విద్యార్థి నడవడిక ఏ విధంగా ఉంది? తదితర అంశాలపై అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించనున్నారు. ఇంటి వద్ద పిల్లలపై పర్యవేక్షణ పెంచి చదివిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని అధ్యాపకులు తల్లిదండ్రులకు వివరిస్తారు. పీటీఎంలు నిర్వహించడం వల్ల తమ పిల్లల చదువులు ఏ విధంగా కొనసాగుతున్నాయి? నడవడిక ఎలా ఉంది? హాజరు తీరు ఏ విధంగా ఉందనేది తల్లిదండ్రులు సైతం తెలుసుకునే అవకాశం ఉండనుంది.

ప్రైవేట్ కంటే మెరుగ్గా తరగతులు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోనే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఫస్టియర్‌లో చేరడానికి ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉండడంతో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇటీవల కళాశాలల్లో సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయి. అంతే కాకుండా లెక్చరర్ల కొరత సమస్య కూడా పరిష్కారమైంది. అన్ని కళాశాలల్లో సరిపడా లెక్చరర్లు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల కంటే మెరుగ్గా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు రాణించనున్నాయి.

- శంకర్ నాయక్, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి

రైతులకు తప్పని యూరియా తిప్పలు

(ఐదో పేజీ తరువాయి)


కూడా ఫర్టిలైజర్ డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా బయట అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. మర్పల్లి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 192, సహకార సంఘానికి మరో 225 బ్యాగులు యూరియా సరఫరా అయింది. అయినా కేవలం 100 బ్యాగులు మాత్రమే ఉన్నాయని డీలర్‌లు సమాధానం ఇవ్వగా రైతులు ఆగ్రహించారు. అలాగే చౌడాపూర్ మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే డీసీఎంఎస్ కార్యాలయం దగ్గర బారులు తీరారు. యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిల్చున్నారు.

ఇండెంట్ 50 టన్నులు.. సరఫరా 14టన్నులు

ధారూరు పీఏసీఎస్‌కు సోమవారం 300ల బస్తాల యూరియా మాత్రమే రావడంతో సరిపడా లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఏఈవో సంజూ రాథోడ్‌లు జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నంతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. రిజిస్టర్‌లో రైతుల వివరాలు నమోదు చేసి యూరియా సరఫరా చేయించాలని డీఏవో సూచించారు. కాగా ఉదయం 7 గంటల నుంచే పీఏసీఎస్ కార్యాలయం ముందు రైతులు యూరియా కోసం రైతుల తాకిడి పెరగటంతో పోలీసు బందోబస్తుతో సరఫరా చేశారు. కాగా, ధారూరు సొసైటీ నుంచి అధికారులు 50 టన్నుల యూరియా కోసం ఇండెంట్ పెడితే కేవలం 14 టన్నుల యూరియా పంపించారు. లారీలో 600 బస్తాలు రాగా 300 బస్తాలు మోమిన్‌కుర్దుకు పంపించారు. దీంతో ఈసొసైటీ పరిధిలో ఎక్కువ మంది రైతులు ఉన్నా తక్కువ మొత్తంలో యూరియా సరఫరా చేయటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, రైతులు నానో యూరియాను వాడుకోవాలని, అలాగే వాడకం తగ్గించుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారులు నచ్చచెప్పినా ఫలితం కనిపించడం లేదు.

మోమిన్‌పేట్ పీఏసీఎస్ కేంద్రం వద్ద బారులు

ఆనాటి చీకటి రోజులు మళ్లీ వచ్చాయని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. సోమవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రైతులకు అవసరమైనంత యూరియాను అందించే వారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. యూరియా కొరతను తీర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ సర్పంచ్‌లు అంగెరి శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లేశం, రాంరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: శివారెడ్డిపేట పీఏసీఎస్ వద్ద రైతుల క్యూ

సంక్షిప్తంగా..

అదనపు తరగతి గదుల ప్రారంభం

పరిగి: స్థానిక శిశుమందిర్ పాఠశాలలో కొత్తగా నిర్మించిన తాత్కాలిక గదులను పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు.

బస్టాండ్ నిర్మాణానికి మరో రూ.4లక్షలు

బషీరాబాద్: మైల్వార్‌లో బస్టాండ్ నిర్మాణం పనులు జోరందుకున్నాయి. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2.50లక్షలు మంజూరు కాగా బస్టాండ్ భవనంతో పాటు రెండు షెటర్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకు మరో రూ.4లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు సోంపల్లి బిచ్చిరెడ్డి, నగేష్ వెల్లడించారు.

విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు

మర్పల్లి: మర్పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా జరగడంతో సోమవారం విద్యార్థులు ఉదయాన్నే బకెట్ల ద్వారా తాగు నీటిని తీసుకెళ్లారు.

పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

కీసర రూరల్: పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ రామక్రిష్ణనగర్ కాలనీవాసులు డిమాండ్ చేసారు. ఆలయానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురౌతుందని రెండు నెలల క్రితం ఫిర్యాదు చేసినా నాగారం మున్సిపల్ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై కాలనీ వాసులు సోమవారం నాగారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బొంరాస్‌పేట్: మెట్లకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని బుర్రి, మైసమ్మ, భోజనగడ్డ తండాలకు చెందిన 70మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా వారిని కండువాలతో ఆహ్వానించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బొంరాస్‌పేట్: కాకర్లగండి తండాకు చెందిన ఇస్లావత్ కవితకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు.

పర్సాపూర్‌లో వ్యవసాయాధికారుల సందర్శన

కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో విభిన్న పంటలు సాగుచేస్తున్న చెందిన నవీన్ పొలాన్ని సోమవారం మండల వ్యవసాయ అధికారిణి శ్రీమతి జి.తులసి, ఏఈవోలు అశ్విని, శ్రీపతి, ఐజాక్ హెరాల్డ్, రాజులతో కలిసి పరిశీలించారు.

తాండూరు ఆర్టీసీ డిపోను సందర్శించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

తాండూరు: తాండూరు ఆర్టీసీ డిపోను సోమవారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రు షా ఖాన్ పరిశీలించారు. డిపోలో కలియ తిరుగుతూ ఏ ప్రాంతాలకు బస్సు సౌకర్యం ఉందని ఎక్కువగా రెవెన్యూ వచ్చే ప్రాంతాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు డిపోలో మొక్కలు నాటారు. డిపో మేనేజర్ సురేష్‌కుమార్ ఉన్నారు.

గేదెల షెడ్డు నిర్మాణానికి చెక్కు అందజేత

దుద్యాల: ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గేదెల షెడ్డు నిర్మించుకున్న కుదురుమళ్లకు చెందిన బాలుకు సోమవారం మాజీ సర్పంచ్ అనిత రఘుపతి ఆధ్వర్యంలో నాయకులు చెక్కును అందజేశారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

ధారూరు: ఎస్సీఎస్టీ, సన్నకారు, మహిళ రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తామని, అవసరమున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్ తెలిపారు. రైతులు దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్సుతో రావాలని సూచించారు.